

సహస్ర కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్

చిన్నారి కుటుంబానికి అండగా ఉంటాం

● టీపీసీసీ ఉపాధ్యక్షుడు రమేశ్

కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): చిన్నారి సహస్రను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అదుకుంటామని టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేశ్ అన్నారు. కూకట్‌పల్లి దయార్‌గూడాలో మృతి చెందిన చిన్నారి సహస్ర కుటుంబీకులను రమేశ్ పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునారవృతం కాకుండా పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు దర్యాప్తు ఇప్పటికే ముమ్మురం చేశారని త్వరలోనే నిందితుడిని పోలీసులు పట్టుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అవసరమైన సాయం అందిస్తామని అన్నారు. అనంతరం మూసాపేటలోని వేంకటేశ్వరాలయంలో నిర్వహించిన వార్షికోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్‌రావు, వేణు, సంతోష్, రమేశ్, నాగరాజు పాల్గొన్నారు.



గోడ కూలిన ఇంటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్

శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండొద్దు

● కార్పొరేటర్ సతీష్‌గౌడ్

ఫతేనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో ఉండొద్దని ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ప్రజలకు సూచించారు. ఫతేనగర్ డివిజన్ ప్రభాకర్‌రెడ్డినగర్‌లోని భిక్షపతి ఇంటి గోడ కూలిపోయింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్ మూసాపేట సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కరుణాకర్, న్యాక్ ఇంజనీర్ చంద్రశేఖర్‌తో కలిసి కార్పొరేటర్ గోడకూలిన ఇంటిని పరిశీలించారు. ఇంటి మిగతా భాగం కూడా కూలిపోయే ప్రమాదం ఉన్నందున.. భిక్షపతి అనుమతితో ఇంటిని కూల్చివేయాలని కార్పొరేటర్ అధికారులకు సూచించారు. అనంతరం బాధితులకు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం కనకదుర్గా ఆలయ 29వ వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామిరెడ్డి, సాగర్, సుదర్శన్‌రెడ్డి, విష్ణు, లక్ష్మి, భిక్షపతి, భాగయ్య, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు సింహచలం కుటుంబానికి మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్‌కుమార్, అదనపు డీసీపీ వీరన్న, మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య హెచ్‌డీఎఫ్‌సీ అధికారులు సత్యనారాయణరావు, శర్మిష్ఠలు మంగళవారం రూ.35లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని మియాపూర్ ట్రాఫిక్ పీఎస్‌లో సింహచలం హోంగార్డుగా విధులు నిర్వహించేవాడని వారు తెలిపారు. రాష్ట్ర హోంగార్డుల శాఖతో హెచ్‌డీఎఫ్‌సీ జీతం ప్యాకేజీ కింద అందించిన ప్రమాద మరణ బీమా కవరేజ్‌లో భాగంగానే ఈ ప్రమాద బీమా క్లెయిమ్‌ను అందించామని వారు చెప్పారు.

కూకట్‌పల్లిలో బాలానగర్ ఎంఈఓ తిష్ట..!

● ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

● మా ఎంఈఓ ఆఫీస్ మాకే కావాలంటూ ప్లకార్డులతో నిరసన



కూకట్‌పల్లి ఎంఈఓ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి మండల విద్యాశాఖ కార్యాలయంలో బాలానగర్ ఎంఈఓ తిష్టవేశారు. దీంతో కూకట్‌పల్లి ఎంఈఓ కూర్చునేందుకు వీలు లేకుండా పోయింది. కూకట్‌పల్లి ఎంఈఓగా కిషన్ 2024 సెప్టెంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అప్పటికే ఎంఈఓ కార్యాలయంలో బాలానగర్ ఎంఈఓ ఉండడంతో డీఈవో డీసీఈబీ గదిలో ఉండాలని కిషన్‌కు సూచించారు. తాజాగా రెండు రోజుల క్రితం డీఈసీబీ గదికి అధికారులు తాళం వేశారు. దీంతో ఎంఈఓ ఎక్కడ కూర్చోవాలో తెలియడం లేదు. ఈ విషయంపై కూకట్‌పల్లి ఉపాధ్యాయులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ "మా ఎంఈఓ కార్యాలయం మాకే కావాలం"టూ మంగళవారం కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలానగర్ ఎంఈఓ 11 మాసాలుగా కూకట్‌పల్లి ఎంఈఓ కార్యాలయానికి వచ్చి ఇక్కడే తిష్ట వేశారని అన్నారు. వెంటనే వారు ఇక్కడినుంచి బాలానగర్ మండలానికి వెళ్లిపోవాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు సంబంధించిన ఫైల్స్ చాలా పెండింగ్‌లో ఉన్నాయని, తనకు ప్రత్యేక గది కేటాయించాలి లేదా బాలానగర్ ఎంఈవోను ఆయన మండలానికి పంపాలని కూకట్‌పల్లి ఎంఈవో కిషన్ ఉన్నతాధికారులను కోరారు. ఈ విషయంలో డీఈవో స్పందించాలని పలువురు ఉపాధ్యాయులు కోరారు. లేని పక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. నిరసన తెలిపిన వారిలో ఉపాధ్యాయులు వెంకట్, విఠల్, ఆంజనేయులు, ప్రదీప్, మల్లారెడ్డి, రాధిక, మస్తాన్, సిద్ధయ్య, శర్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మురుగునీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని, మురుగు నీరు వెళ్లకుండా ఎక్కడైనా అడ్డంకులు ఉంటే వెంటనే వాటిని తొలగించాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధికారులను ఆదేశించారు. కార్పొరేటర్ సత్యనారాయణరావుతో కలిసి కూకట్‌పల్లి డివిజన్ ప్రకాశ్‌నగర్‌లో మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. కాలనీల్లో మురుగునీటి సమస్య ఎక్కువైందని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు. స్పందించిన ఆయన మురుగునీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వ్యాధులు సోకే ప్రమాదం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి ప్రభాకర్,ప్రకాశ్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

అందరూ బాగుండాలి..

ఫతేనగర్: భగవంతుని దయతో అందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్టు ఎమ్మెల్యే కృష్ణారావు తెలిపారు. ఫతేనగర్ డివిజన్‌లో వేంకటేశ్వరాలయ 24వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌ను శాలువాతో సత్కరించి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజశేఖర్

ఫతేనగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశా వర్కర్ల వేతనాలను పెంచి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బాలానగర్ పీహెచ్‌సీ ముందు ఆశావర్కర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆశావర్కర్ల నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఆశావర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో పెద్దఎత్తున్న ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం బాలానగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పద్మజకు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఆశా వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బాలానగర్ పీహెచ్‌సీ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఆశావర్కర్లు, మద్దతు తెలియజేసిన సీఐటీయూ

వెల్‌నెస్ సెంటర్‌లో సేవలకు అంతరాయం

● ఇంటర్నెట్ రాకపోవడంతో ఇబ్బందులు

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మంగళవారం ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. విద్యుత్ స్తంభాలపై అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కేబుల్స్‌తో పాటు కొన్నిచోట్ల ఇంటర్‌నెట్ వైర్లను విద్యుత్ సిబ్బంది తొలగించారు. దీంతో కూకట్‌పల్లిలోని వెల్‌నెస్ సెంటర్‌లో కూడా మంగళవారం సేవలకు అంతరాయం కలిగింది. మందుల కోసం వచ్చిన వారు వెనుదిరగాల్సి వచ్చింది. సెంటర్‌లోని సిబ్బంది తమ మొబైల్ డేటాను కంప్యూటర్లకు అనుసంధానం చేసి కొంతసేపు సేవలను అందించగలిగారు.

'ముంపు సమస్యను పరిష్కరించాలి'

కూకట్‌పల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డ, మోతినగర్ ప్రధాన రహదారి, బీఎస్పీ కాలనీలో ముంపు సమస్యను పరిష్కరించాలని మూసాపేట కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ అధికారులను కోరారు. ఈ మేరకు మంగళవారం యూసుఫ్‌గూడ డీసీ రజనీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని డీసీని కోరినట్లు ఆయన తెలిపారు. బీజేపీ నాయకులు ఎర్రస్వామి, రవిగౌడ్, అబ్బాస్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

ఓల్డుబోయినపల్లి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనానికి చెరువుల వద్ద పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తున్నామని కూకట్‌పల్లి సర్కిల్ ఉప కమిషనర్ గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఓల్డుబోయినపల్లి, హస్మత్‌పేటలోని బోయిన్‌చెరువు, బతుకమ్మకుంటను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈఈ గోవర్ధన్‌గౌడ్, ఏఈ ఆశ, ట్రాఫిక్ సీఐ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఇటీవల ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిటింగ్ నిర్వహించగా ఈ బాగోతం బయటపడింది. ఆసుపత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కానీ 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమైంది. పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

పండ్లు పంపిణీ

కేపీహెచ్‌బీకాలనీ, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి శివానంద రిహాబిలిటేషన్ కేంద్రంలో కార్పొరేటర్ శిరీషబాబురావు మంగళవారం పండ్లు పంపిణీ చేశారు. మాజీ కార్పొరేటర్ బాబురావు, పవన్‌కుమార్, వెంకటేష్ చౌదరి, రాజేష్‌రాయ్, రాజశేఖర్‌రెడ్డి, సత్యప్రకాష్, వంశీ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE VIII ADDL. DISTRICT JUDGE, RANGA REDDY DISTRICT AT L.B. NAGAR

I.A.No. 885,886 of 2014
IN
LGOP No.740 of 2016

Between:
Smt. Gokari Kamalamma & Another ...Petitioners
AND
K. Sreenivasa Rao & others ...Respondents

NOTICE

To,
Smt. Challa Kalyani (Respondent No.10), D/o. Challa Krishnamurthy, W/o Uppala Kiran Kumar, Aged 30 Years,Occ: Housewife, R/o Flat No.207, H.No.2-1-407/A8/3, Shanthi Bhavan, Nallakunta, Hyderabad.
Smt. J.Viswa Bharathi, (Respondent No.19) W/o Sri A.Bala Krishna, Aged 35 years, Occ: business, R/o Plot No.4, Saptagiri Nagar, Mehdipatnam, Hyderabad.
Smt.K.Sudhira, (Respondent No.21) W/o K.V.Narayana Rao, aged 28 years, Occ: Housewife, R/o Plot No.7, HUDA Trade Centre, Lingampalli, Hyderabad.
M.Prabhakara Rao, (Respondent No.22) S/o M.Venkata Ramaiah, Aged 53 Years, Occ: Business, R/o H.No.A/34, Phase-II, Allwyn Colony, Kukatpally, Hyderabad.

Whereas the petitioner named above has filed LGOP No.740 of 2016 against you and 35 others for declaring respondents as land grabbers and prosecute respondents as per land Grabbing Act and direct the respondents to deliver vacant possession and pay damages to petitioners.

PLEASE take notice that the above LGOP and above I.A Nos. 885 and 886/2014 for your appearance. You are required to appear before the Hon'ble court on 25-08-2025 at 10:30 AM in person or through an advocate failing which, the matter will be heard and decided in your absence.

//BY ORDER OF THE COURT//
D. Rama Krishna, Advocate
Flat No.504 & 506, Balaji Arcade,
New Nallakunta, Hyderabad-44
Cell No.9848814343



రోడ్డుపై నిలిచిన వరద నీరు

రోడ్లపై నిలిచిన వరద నీటితో ఇబ్బందులు

గచ్చిబౌలి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పది రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పార్కులు, రోడ్లపై వరద నీరు నిలవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొండాపూర్ ప్రశాంత్‌నగర్‌కు వెళ్లే రోడ్డుపై మోకాళ్లలోతు వరదనీరు నిలిచింది. వారం రోజులుగా నీరు ఉండటంతో రాకపోకలు సాగించేందుకు సఫారినగర్ ప్రజలు, సమీపంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గడ్డర్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి

ప్రమాదకరంగా గడ్డర్

హైదర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ పక్కన నాలా మీదుగా మాధవరంనగర్ కాలనీ లింక్‌రోడ్‌పై ఉన్న గడ్డర్‌ను ఓ ఆటో ఢీకొనడంతో వంగిపోయి ప్రమాదకరంగా మారింది. విషయంలో తెలుసుకున్న కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గడర్ ఏ క్షణమైనా పడిపోయే ప్రమాదం ఉందని, ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్డుపై రాకపోకలు నిలిపివేసి మరమ్మతులు చేయనున్నట్లు తెలిపారు.

ఎర్రగడ్డ ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిటింగ్ నిర్వహించగా ఈ బాగోతం బయటపడింది. ఆసుపత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50 మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కాని 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6 లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమై పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

హోంగార్డు కుటుంబానికి బీమా చెక్కు అందజేత

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు సింహచలం కుటుంబానికి మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ రంజన్ రతన్‌కుమార్, అదనపు డీసీపీ వీరన్న, మియాపూర్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటయ్య హెచ్‌డీఎఫ్‌సీ అధికారులు సత్యనారాయణరావు, శర్మిష్టలు మంగళవారం రూ.35లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లోని మియాపూర్ ట్రాఫిక్ పీఎస్‌లో సింహచలం హోంగార్డుగా విధులు నిర్వహించేవాడని వారు తెలిపారు. రాష్ట్ర హోంగార్డుల శాఖతో హెచ్‌డీఎఫ్‌సీ జీతం ప్యాకేజీ కింద అందించిన ప్రమాద మరణ బీమా కవరేజ్‌లో భాగంగానే ఈ ప్రమాద బీమా క్లెయిమ్‌ను అందించామని వారు చెప్పారు.

పేదలకు అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సీఎన్‌జీ సబ్సిడీ ఆటోల స్కీంలో భాగంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ శంషీగూడ, శ్రీనగర్ కాలనీలకు చెదిఇన లబ్ధిదారులకు ఏడు ఆటోలు మంజూరయ్యాయి. మంగళవారం ఎమ్మెల్యే గాంధీ వారికి ఆటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటోలు జాగ్రత్తగా నడుపుకుని జీవితంలో పైకి రావాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, శ్రీనివాస్‌యాదవ్, పురేందర్‌రెడ్డి, మల్లయ్య, పవన్‌గౌడ్, కాజా, శ్రీనగర్ కాలనీ అధ్యక్షుడు వీరన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఆటోలు అందజేస్తున్న ఎమ్మెల్యే



గణేష్‌యాదవ్‌ను సన్మానించి కేక్ కట్ చేస్తున్న బలరాంయాదవ్ తదితరులు



జగద్గిరిగుట్ట ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

హైదర్‌నగర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అసోసియేషన్ అధ్యక్షుడు కమ్మరి రామకృష్ణాచారి హాజరై లూయిస్ మండే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ నుంచి త్వరలోనే ఈఎస్ఐ ఫ్యామిలీ హెల్త్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు రమేష్ రావు, స్థానికులు ఉమాశంకర్, ప్రభాకర్‌రెడ్డి, మురళి, రాజేందర్, శ్రీనివాస్, సాగర్, విజయసాగర్, అంజయ్యసాగర్, చంద్రశేఖర్‌చారి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్‌లో..

గచ్చిబౌలి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా శేరిలింగంపల్లి సీనియర్ నాయకుడు బలరాం యాదవ్ ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్‌లో కాలనీకి చెందిన గణేష్‌యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రమేష్ యాదవ్, నాగరాజుయాదవ్, వెంకటేశ్వర్లు, అవదీష్ నారాయణ, జయపాల్ రెడ్డి, అశోక్, సన్నీయాదవ్, వెంకటరామయ్య, శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు, ప్రకృతికి విడదీయలేని బంధం

● సినీ నటుడు తనికెళ్ల భరణి

రాయదుర్గం, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, పండుగలకు, ప్రకృతికి విడదీయలేని బంధం ఉందని ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి అన్నారు. గ్రీన్ గణేశ కార్యక్రమం 18వ ఎడిషన్, స్మార్ట్ యాప్ ఆధారిత వ్యర్థ సేకరణ కార్యక్రమం మంగళవారం గచ్చిబౌలి మైంహోం భుజలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై నిర్వాకులతో కలిసి యాప్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగర వ్యాప్తంగా మట్టితో తయారు చేసిన గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వారిని అభినందించారు. పర్యావరణం కలుషితం కాకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని ఆయన సూచించారు. గ్రీన్ గణేశ్‌తో పాటు రోజువారీ వ్యర్థాలను స్మార్ట్ యాప్ సాయంతో సేకరించడం అభినందనీయమన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సస్టైనబిలిటీ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో మసూద్ మల్లిక్, మైహోం భుజ నివాసితులు పాల్గొన్నారు.



మట్టి గణపతులను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు తనికెళ్ల భరణి తదితరులు

వినాయకచవితి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

గచ్చిబౌలి, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఏసీపీ శ్రీనివాస్‌కుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం శేరిలింగంపల్లి దూబేకాలనీలో చందానగర్ పోలీసులు పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటు ఎక్కడ జరుగుతుంది, విగ్రహాలు ఎక్కడ తీసుకువస్తున్నారు, ఎక్కడ నిమజ్జనం చేస్తారు, విద్యుత్ సరఫరా, రాత్రి, పగలు విగ్రహాల వద్ద కాపలా ఉంటున్నారా అనే అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులకు ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఏ సమస్య ఉన్నా తమకు ముందుగా తెలియజేస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మిలాద్ ఉన్ నబీ పండుగ ఉండటంతో ముస్లింలు కూడా ప్రశాంత వాతావరణంలోవేడుకలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో చందానర్ ఎస్సై ఖాజా అహ్మద్, ఆర్‌సీపురం ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ, విద్యుత్, అగ్నిమాపకశాఖ, చందానగర్ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శ్రీనివాస్‌కుమార్, హాజరైన వినాయక మండపాల నిర్వాహకులు

ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చందానగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చందానగర్ బస్టాప్ సమీపంలో గుర్తుతెలియని 50-60 సంవత్సరాల వయసున్న వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా పటాన్‌చెరువు నుంచి సీబీఎస్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు డయల్ 100కు ఫోన్ చేయగా చందానగర్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.



నేడు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన

రాయదుర్గం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

నేటి నుంచి ఇండియా బ్యాడ్మింటన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ పోటీలను రాష్ట్ర క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం ప్రారంభించనున్నారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో జరగనున్న ఈ పోటీల్లో ఇంగ్లండ్, అమెరికా, యూఏఈతో పాటు వివిధ దేశాలకు చెందిన సుమారు 350 మంది యువ షట్లర్లు పోటీ పడుతున్నారు. ఈనెల 24వ తేదీన ఫైనల్స్ జరగనున్నాయి.

'కాంగ్రెస్‌కు బీసీలు గుణపాఠం చెబుతారు'

గచ్చిబౌలి, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): చట్టపరంగా బీసీలకు 42శాతం రిజర్వేషన్ లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని శేరిలింగంపల్లి నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు మాధవరావు అన్నారు. ఈ నెల 25న ఇందిరా పార్కు వద్ద రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీలను కోరారు.

పేదలకు వరం 'కల్యాణలక్ష్మి' : బీఆర్ఎస్



గాజులరామారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడ బిడ్డలకు కల్యాణలక్ష్మి పథకం వరం లాంటిదని గాజుల రామారం బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు విజయ్ రామ్‌రెడ్డి అన్నారు. డివిజన్ లోని బాలయ్యనగర్‌కు చెందిన జయలక్ష్మికి కల్యాణలక్ష్మి పథకం కింద మంజూరైన రూ.లక్షా 116 చెక్కును ఆయన తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో బాలయ్యనగర్ వెల్ఫేర్ అధ్యక్షుడు నగేష్, పార్వతి, చిన్న, సత్తిబాబు, మురళి పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాలను తనిఖీ చేసిన డీఐఈఓ

దుండిగల్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్‌లోని కేఎం పాండు మెమోరియల్ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలను మేడ్చల్ జిల్లా డీఐఈఓ కిషన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధ్యాపకుల బోధిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి యూనిట్ టెస్ట్‌లో వారికి వచ్చిన మార్కులను పరిశీలించారు. అనంతరం అధ్యాపకులతో సమావేశమై వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ షేక్ షైమస్, అధ్యాపక బృందం పాల్గొంది.

రోడ్డు కుంగిన చోట మరమ్మతు



పేట్‌బషీరాబాద్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): 'కుంగిన మట్టితో ప్రమాదం' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రచురించిన కథనానికి భవన నిర్మాణదారు లు స్పందించారు. కొంపల్లి పురపాలక సంఘం పరిధిలోని సెంట్ర ల్ పార్కు నుంచి ఫేజ్ జూనియర్ కాలేజీ ఎదురుగా రోడ్డు కింద జేసీబీలతో మట్టిని నింపారు. ఆంధ్రజ్యోతి కృషి వల్ల ప్రమాదం తప్పినట్లయిందని స్థానికులు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్ఓసీ అందజేత

నిజాంపేట, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్య ఖర్చుల నిమిత్తం కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంత్‌రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన కురవ రంగన్నకు రూ. 36 వేల 500లు, ఆకుల డానియల్‌కు రూ. 26 వేలు , టి. నగేష్‌కు రూ. 37 వేల 500 మంజూరు కాగా, ఇందుకు సంబంధించిన ఎల్ఓసీ పత్రాలను ఆయన లబ్ధిదారులకు అందజే శారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకొంటున్న శ్రీశైలంగౌడ్

కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి: కూన

షాపూర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు మంగళవారం ఆయనను షాపూర్‌నగర్‌లోని నివాసం వద్ద కలిసి తమ కాలనీలు, బస్తీల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే తన ధ్యేయమన్నారు. కాలనీల్లోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

కేబుల్ వైర్ల తొలగింపు మొదలు

● రామంతాపూర్ దుర్ఘటనతో చేపట్టిన విద్యుత్ అధికారులు

పేట్‌బషీరాబాద్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని రామంతాపూర్‌లో విద్యుదాఘాతంలో ఐదుగురు వ్యక్తులు మృతి చెందడంతో విద్యుత్ అధికారులు మేల్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని కొంపల్లి, జీడిమెట్ల, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లోని విద్యుత్ స్తంభాలకు వేలాడుతున్న ప్రైవేట్ కేబుల్ వైర్లను తొలిగించే కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇలా ఉండగా, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరితే పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో ఏదైనా విద్యుత్ సమస్య వస్తే విద్యుత్ శాఖ తన సొంత నిధులతో పరిష్కరించేది. అయితే, ప్రస్తుతం ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో సమస్యలను పరిష్కరించలేపోతున్నామని అధికారులు చెప్తున్నారు అంగడిపేటలో ఇనుప విద్యుత్ స్తంభాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నా ఫలితం లేకుండాపోతోంది. రాఘవేంద్ర కాలనీలో గాలి దుమారం వచ్చినప్పుడు విద్యుత్ తీగలు ఒకదానికొకటి తాకడంతో మంటలొస్తున్నాయని, కొత్తగా కేబుల్ వైర్ వేయాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే, టాన్స్‌ఫార్మర్లు, ఫీజు బాక్సుల దగ్గర వేలాడుతున్న వైర్లను సరి చేయాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



కొంపల్లిలో కేబుల్స్ తొలగింపు పనులను ఏఈ శ్రీనివాస్

కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో..



ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో కేబుల్స్‌ను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

జీడిమెట్ల,ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో విద్యుత్ స్తంభాలకు అనుమతి లేకుండా కట్టిన కేబుల్ వైర్ల తొలగింపు కార్యక్రమాన్ని విద్యుత్ శాఖ అధికారులు మంగళవారం ప్రారంభించారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్‌నగర్, అపురూపాకాలనీల్లోని స్తంభాలకు చుట్టి ఉన్న కేబుళ్లను తొలగించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై .కాలనీ అసోసియేషన్ నాయకులు టీటీకె శ్రీనివాస్, వల్లభనేని రమణ హర్షం వ్యక్తం చేశారు.

వర్షం బాధితులను ఆదుకోవాలి

●టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

షాపూర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా నగరవాసులు పడుతున్న ఇబ్బందులను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని, వర్ష బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నగరంలో వర్షాల వల్ల ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకొనేందుకు ప్రభుత్వం తక్షణ సహాయం కింద రూ. 20 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

వైష్ణోదేవి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం

షాపూర్‌నగర్, ఆగస్టు 19(ఆంధ్ర జ్యోతి): గాజులరామారం సర్కిల్ సర్వే నంబర్ 79లో గల సత్యనారాయణ స్వామి ఆలయం పక్కనే గుట్టపై వెలసిన వైష్ణోదేవి ఆలయ 20వ వార్షికోత్సవాలు మంగళవా రం వైభవంగా ప్రారంభమ య్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు లక్ష్మీగణపతి, వనదుర్గ, వైష్ణోదేవి, మహామృత్యుంజయ మహాయజ్ఞం, మధ్యాహ్నం మహాప్రసాదం పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. బుధ, గురువారాల్లో కూడా ప్రత్యేక పూజలు జరుగుతాయని, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆలయ కమిటీ నిర్వాహకురాలు జ్యోతి తెలిపారు.



గుట్టపై వెలసిన వైష్ణోదేవి అమ్మవారు

వరద నీటితో జనం అవస్థలు

●గాజులరామారంలో మోకాలు

లోతు పారుతున్న వర్షం నీరు

గాజులరామారం, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు పై కాలనీల నుంచి వస్తున్న వరద కింది కాలనీవాసులకు ఇబ్బందికరంగా మారింది . గాజులరామారం వార్డు ఆఫీసు రోడ్డులో మోకాలు లోతు వరద పారుతోంది. దీంతో ప్రజలు వార్డు ఆఫీసుకు, కాలనీలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. బంధన్ చెరువు నుంచి వచ్చే వరద నీరు రావినారాయణరెడ్డినగర్, కమలమ్మనగర్ నుంచి మహాదేవపురం కైలాస్‌హిల్స్ మీదుగా పరికి చెరువులో కలవాల్సి ఉంది. అయితే, ఇక్కడ వరద ఉధృతి ఎక్కువ ఉండటం, అధికారులు దానికి అనుగుణంగా కాలువలను నిర్మించకపోవడంతో వర్షం వచ్చిన ప్రతిసారీ ఇదే సమస్య తలెత్తుతోందని మహాదేవపురం కాలనీవాసులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాలనీల్లోకి వరద నీరు రాకుండా వేరే మార్గంలో వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై పారుతున్న వరద నీరు



అంబేడ్కర్‌నగర్ రోడ్డులో నిలిచిన వరద నీరు

కంపుకొడుతున్న రహదారులు

కుత్బుల్లాపూర్, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ కురుస్తున్న వర్షాల నేపథ్యంలో కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధి పలు కాలనీల్లోని అంతర్గత రహదారుల్లో వరద నీరు నిలిచి పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు ఎక్కువ రోజులు నిలిచి ఉండటంతో దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. బాపూనగర్ పైభాగంలో ఉన్న మిలిటరీ ఏరియా నుంచి రామకృష్ణానగర్, నవోదయనగర్ మీదుగా అంబేడ్కర్‌నగర్, మాణిక్యనగర్ వరకు నీరు పారుతోంది. వరద కాలువలు నిర్మించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

మహిళ మెడలోని గొలుసు స్నాచింగ్

జీడిమెట్ల,ఆగస్టు19(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ ఆదిత్యనగర్‌లో మంగళవారం ఓ మహిళ మెడలోని 3 తులా ల పుస్తెల తాడును ఆగంతకుడు తెంచుకొని పారిపోయారు. జగద్గిరిగుట్ట పోలీసుల కథనం ప్రకారం... ఆల్విన్‌కాలనీ సాయినగర్‌కు చెందిన మౌనిక(23) ఆదిత్యనగర్‌లో టైలరింగ్ షాపు నిర్వహిస్తోంది. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు భోజనం చేసేందుకు ఆమె తన షాపు నుంచి ఇంటికి నడుచుకుంటూ బయలుదేరింది. మార్గం మధ్యలో వెనుక నుంచి నడుచుకుంటూ వచ్చిన ఓ వ్యక్తి (35) మౌనిక మెడలోని 3 తులాల పుస్తెల తాడును తెంచుకొని పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు జగద్గిరిగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఐ నర్సింహ ఆధ్వర్యంలో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వ్యక్తి శవమై కనిపించాడు



కృష్ణ (ఫైల్)

దుండిగల్, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఓ వ్యక్తి చెరువులో శవమై కనిపించాడు. దుండిగల్ పోలీసుల కథనం ప్రకారం...మల్లంపేటకు చెందిన తలారి కృష్ణ (50)కు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కృష్ణ ఏ పనీ చెయ్యకుండా నిత్యం మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవపడేవాడు. ఈ నెల 17న ఉదయం కుటుంబ సభ్యులతో గొడవపడిన అతను సెల్‌ఫోన్‌ను ఇంట్లోనే పెట్టి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా కృష్ణ ఆచూకీ లభించకపోవడంతో సోమవారం దుం డిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తుండగా మంగళవారం కత్వ చెరువులో శవమై కనిపించాడు. కుటుంబసభ్యులతో గొడవ జరగడంతో మనస్తాపానికి గురై కృష్ణ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయుర్వేద ఆస్పత్రిలో నిధుల గోల్‌మాల్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 19(ఆంధ్రజ్యోతి): ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో రోగుల డైట్ పేరుతో లక్షల రూపాయల గోల్‌మాల్ జరిగిన ఉదంతం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల ఆసుపత్రి తాత్కాలిక సూపరింటెండెంట్ ఆడిట్ చేయగా ఈ బాగోతం బయటపడింది. ఆసుపత్రిలో 204 పడకలు ఉన్నప్పటికీ రోజుకు గరిష్ఠంగా 40-50 మంది మాత్రమే ఇన్‌పేషెంట్లుగా ఉంటారని సిబ్బంది చెబుతున్నారు. కానీ 170-180 మందికి డైట్ ఇస్తున్నట్లు లెక్కల్లో చూపి అక్రమాలకు పాల్పడ్డారు. ప్రతి నెలా గరిష్ఠంగా రూ.4.6 లక్షల వరకు డైట్ బిల్లులు వస్తుండగా, అందులో సగం పక్కదారి పడుతోంది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం విజిలెన్స్ దర్యాప్తు ప్రారంభమై పలువురు అధికారులకు నోటీసులు జారీ చేశారు.

కిరాణా షాపులో చోరీ

జీడిమెట్ల, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌లోని ఓ కిరాణాషాపులో సోమవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాసనగర్‌లోని మీసేవ కేంద్రం పక్కన ఉన్న శ్రీలక్ష్మీగణేష్ కిరాణా షాపు షట్టర్‌ను కొందరు పగులగొట్టి దుకాణంలో చోరీకి పాల్పడ్డారు. కౌంటర్‌లో ఉన్న రూ. 10 వేల నగదు, ఇతర సామగ్రిని అపహరించుకుపోయారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.